# నగరంలో విస్తృతంగా తనిఖీలు

- డబ్బు అక్రమ రవాణాకు అడ్డుకట్ట
- తనిఖీలపై ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ
- పలు చోట్ల భారీగా పట్టుబడ్డ నగదు




సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ట్రై పోలీస్ కమిషనరేట్లలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన తనిఖీలలో భారీగా నగదు, బంగారం, వెండి పట్టుబడింది. అదే తరహాలో మంగళవారం కూడా నగదు, బంగారం, వెండి ఆభరణాలను పట్టుబడ్డాయి. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో ఈ తనిఖీలు కొనసాగాయి. శివారు ప్రాంతాలతో పాటు నగరంలోని ప్రధాన ప్రాంతాల్లోనూ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల నిఘాలో బంజారాహిల్స్‌లో భారీ ఎత్తున హవాల రాకెట్ గుట్టు బయటపడింది. కారులో తీసుకెళ్తున్న ఆధారాలు లేని సొమ్ము ఒకే చోట రూ. 3.35 కోట్లు పట్టుబడింది. బంజారాహిల్స్‌తో పాటు సికింద్రాబాద్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, అబిడ్స్, మెహిదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్, బేగంపేట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాలలో సోదాలు కొనసాగాయి. ప్రతి రోజు జరుగుతున్న ఈ సోదాలపై ఎన్నికల నిర్వహణ అధికారులతో పాటు పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర పర్యవేక్షిస్తున్నారు.

### నిబంధనలు పాటించకుంటే కేసులే..

ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో పౌరుల వద్ద రూ. 50 వేల కంటే ఎక్కువగా నగదు నిల్వ ఉండకూడదు. అంతకంటే ఎక్కువగా డబ్బు ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు తప్పని సరిగా తమ వెంట ఉండాలి. అలా కాకుండా ఎక్కువ మొత్తంలో నగదుతో ప్రయాణాలు సాగిస్తే పోలీసుల తనిఖీలలో పట్టుబడే అవకాశం ఉంటుంది. పట్టుబడ్డ సొమ్మును పోలీసులు ఐటీ శాఖకు అప్పగిస్తారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులను భారీ ఎత్తున నాయకులు జమ చేస్తుంటారు. అలాంటివి ఎక్కడైనా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింతే వెంటనే సోదాలు చేసి పట్టుకుంటారు. నాయకులను నమ్ముకొని ఎవరైనా ఇలాంటి వస్తువులు తమ ఇండ్లలో దాచిపెట్టినా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుంది. దీంతో ఎన్నికల నిర్వాహణకు సంబంధించిన నిఘా కొనసాగుతుంది. ఇందులో భాగంగా కేవలం పోలీసుల శాఖయే కాకుండా ఎన్నికల నిర్వహణ అధికారుల నిఘా సైతం కొనసాగుతున్నది.

### నగరంలో నగదు పట్టివేత..

- **మెహిదీపట్నం:** ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెహిదీపట్నం మెరాజ్ చౌరస్తాలో స్కూటీలో తీసుకువెళ్తున్న రూ.6 లక్షల నగదును పట్టుకున్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీసీపీ కిరణ్ ఖరె ప్రభాకర్ హెచ్చరించారు.
- **చాదర్‌ఘాట్:** మలక్‌పేట ఫైర్ స్టేషన్ రోడ్డులో చాదర్‌ఘాట్ పోలీసులు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న దాదాపు రూ.2.30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- **బేగంపేట:** మహంకాళి పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు, రశీదులు లేని రూ.32.50 లక్షల నగదు, 706 గ్రాముల బంగారం, 3.4 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఐటీ శాఖకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపారు.
- **శామీర్‌పేట:** శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగాపూర్‌లో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా.. రూ89,500లు పట్టుబడ్డాయి.
- **పీర్జాదిగూడ:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచర్ల ఐవోసీఎల్ గ్యాస్ గోడౌన్ సమీపంలో మంగళవారం మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు, మేడిపల్లి పోలీసులు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కారులో రూ. 6,01,940 తరలిస్తూ పట్టుబడ్డాడు.
- **గోల్నాక:** అంబర్‌పేట ప్రధాన రహదారి విశాల్ మార్ట్ చెక్ పోస్ట్ మీదుగా బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి అంబర్‌పేట పోలీసులు రూ.2.25 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- **ఖైరతాబాద్:** పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ముసద్దీలాల్ జువెల్లర్స్ వద్ద మంగళవారం ఓ మహిళ వద్ద నుంచి పోలీసులు రూ. ఐదు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- **వెంగళరావునగర్:** ఎస్‌ఆర్ నగర్ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడి వద్ద నుంచి రూ. 15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- **కవాడిగూడ:** దోమలగూడ పోలీసులు మంగళవారం రాత్రి నారాయణగూడ వై జంక్షన్‌లో నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడి నుంచి రూ. ఆరు లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

## కెనడాలో ఉద్యోగమంటూ..
# రూ. 2.9 కోట్ల మోసం

- సీసీఎస్‌లో కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): కెనడాలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు రూ.2.9 కోట్లు మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. లక్డీకాపూల్‌లో మదన్ కుమార్ కొంతకాలంగా రియాన్ వీసా ఇమ్మిగ్రేషన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. వివిధ దేశాలకు వెళ్లేందుకు వీసాలు ఇప్పిస్తామంటూ ఇంటర్నెట్‌లో ప్రకటనలు ఇచ్చాడు. ఆ ప్రకటన చూసిన గండిపేట నివాసి జగన్నాథ్ రామ్ లక్డీకాపూల్‌లో ఉన్న కన్సల్టెన్సీని సంప్రదించాడు. కెనడాలో ఉద్యోగం కావాలంటూ మదన్ కుమార్ అడిగాడు. కెనడాతో పాటు ఇతర దేశాలకు ఉద్యోగాలు, చదువుకోడానికి వెళ్లేవారికి వీసా ప్రాసెసింగ్ చేస్తానంటూ చెప్పాడు. దీంతో బాధితుడు తనకు కెనడాలో ఉద్యోగం చేయాలని ఉందంటూ చెప్పడంతో తప్పని సరిగా ఉద్యోగం ఇప్పిస్తామని, ఫుడ్ సూపర్‌వైజర్ ఉద్యోగం ఉన్నదంటూ నమ్మించాడు. ఇందుకు రూ.15.5 లక్షలు ఖర్చవుతుందంటూ చెప్పాడు. అక్టోబర్, 2022లో ఇద్దరు ఒప్పందం చేసుకున్నారు. తొలుత బాధితుడు రూ.9 లక్షలు చెల్లించాడు. కొన్నిరోజుల తర్వాత గెల్విన్ ఇంటర్నేషన్ కంపెనీ నుంచి సెక్యూరిటీ పర్సనల్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందినట్లు ఇన్విటేషన్ , కెనడా గవర్నమెంట్ నుంచి లేబర్ మార్కెట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎల్ఎంఐఏ)ను తెప్పించి జగన్నాథ్‌కు అందజేశాడు. దీంతో ఫిబ్రవరి 2023లో ఒప్పందం మేరకు బాధితుడు పూర్తి డబ్బును చెల్లించాడు. ఇక వీసా వచ్చేదే ఆలస్యమంటూ జగన్నాథ్ ఎదురు చూస్తున్నాడు. నెలలు గడిచినా వీసా రాలేదు. దీంతో అసలు కెనడా కంపెనీ నుంచి ఇన్విటేషన్ లెటర్ వచ్చిన మాట వాస్తవమా..? కదా..? అని ఆరా తీశాడు. గెల్విన్ ఇంటర్నేషన్ కంపెనీలో ఆరా తీయగా.. బాధితుడి పేరుతో రికార్డు లేదని తెలిసింది. దీంతో మదన్‌కుమార్‌ను కలిసి నిలదీశాడు. తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వాలంటూ బాధితుడు అడిగాడు. డబ్బులు తిరిగి ఇస్తానంటూ ఒప్పుకున్న మదన్‌కుమార్ రోజూ కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నాడు. మరో 38 మంది బాధితులు కూడా ఈవిధంగానే మోసపోయారు. బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ రెగ్యులేటర్లను మీడియాకు చూపిస్తున్న అబిడ్స్ ఏసీపీ ఎ.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నమిండ్ల శంకర్

## నకిలీ రెగ్యులేటర్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 10: నకిలీ రెగ్యులేటర్లను విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల్లో ఒకరిని బేగంబజార్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 20 డబ్బాల్లో ఉన్న వెయ్యి నకిలీ రెగ్యులేటర్లు స్వాధీనం చేసుకున్నారు. బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అబిడ్స్ ఏసీపీ ఎ.చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ నమిండ్ల శంకర్ వివరాలను వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన దేవరాజ్ పర్మార్(28), హిమ్మత్ పర్మార్(22) జీవనోపాధి కోసం నగరానికి వచ్చారు. ఓల్డ్ ఫీల్‌ఖానా రోడ్‌లో ధన లక్ష్మి ఏజెన్సీ పేరిట షాపును నిర్వహిస్తున్నారు. సులువుగా డబ్బును సంపాదించేందుకు ఢిల్లీ నుంచి తెలిసిన వారి ద్వారా రూ.250 ఒక నకిలీ రెగ్యులేటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. వాటిని బేగంబజార్‌లోని తన షాపు ద్వారా హెచ్‌పీ గ్యాస్ కంపెనీకి చెందిన స్టిక్కర్లు అతికించి ఒక్కొక్కటి రూ.500 చొప్పున సామాన్య ప్రజలకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బేగంబజార్ డీఐ ఏడుకొండలు, డీఎస్‌ఐలు వై.సాయి తేజ రెడ్డి, కె.యాదగిరి, సిబ్బందితో కలిసి దుకాణంపై దాడిచేశారు. 20 డబ్బాల్లో ఉన్న వెయ్యి నకిలీ రెగ్యులేటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితుల్లో హిమ్మత్ పర్మార్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు దేవరాజ్ పర్మార్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

## 16 లోపు ఆయుధాలు డిపాజిట్ చేయండి

- ట్రై పోలీస్ కమిషనర్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయుధాల లైసెన్స్ పొందిన వారు తమ వద్ద ఉన్న ఆయుధాలను స్థానిక పోలీస్‌స్టేషన్, సంబంధిత డీలర్స్ వద్ద ఈ నెల 16వ తేదీలోపు డిపాజిట్ చేయాలని హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. డిపాజిట్ చేసిన ఆయుధాలను డిసెంబర్ 10వ తేదీ తర్వాత తిరిగి తీసుకోవాలని సూచించారు. జాతీయ బ్యాంకుల గార్డు డ్యూటీ, పబ్లిక్ సెక్టార్‌లో సెక్యూరిటీ పర్సనల్స్‌కు వారి వారి అవసరాలను బట్టి మినాయింపు ఉంటుందన్నారు. కాగా, ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు కావాలనుకునే వారు డిస్ట్రిక్ట్ ఆర్మ్స్ స్క్రీనింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. ఇతర వివరాలకు సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలోని ఎస్బీ ఏసీపీ తిరుపతిరావు (9490617429)ను సంప్రదించాలని సూచించారు.

## క్లెయిమ్ చేయని 1166 వాహనాల వేలం

- అభ్యంతరాలు ఉంటే సంప్రదించండి : సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల్లో ఇంకా కొన్ని వాహనాలను ఆయా యజమానులు క్లెయిమ్ చేసుకోలేదు. క్లెయిమ్ చేసుకొని 1166 వాహనాలను బహిరంగ వేలంలో విక్రయించేందుకు నిర్ణయించినట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ వాహనాల వేలంపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే ఆయా వాహనాలకు సంబంధించిన సంబంధిత డాక్యుమెంట్లతో వేలం ప్రకటన విడుదలైన ఆరు నెలల లోపు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ పేరుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన వివరాలను గోషామహల్‌లోని శివకుమార్ లాల్ పోలీస్ స్టేడియంలో తెలుసుకోవాలని, అలాగే www.hyderabadpolice.gov.inలోనూ తెలుసుకోవచ్చని సీపీ సూచించారు.




హైదర్‌గూడలో డివైడర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

## బీభత్సం సృష్టించిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

హిమాయత్‌నగర్, అక్టోబర్ 10: ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బీభత్సం సృష్టించింది. ఈ ఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. ఏపీకి చెందిన ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బషీర్‌బాగ్‌లో ప్రయాణికులను దింపేసి.. అక్కడి నుంచి ఎల్బీనగర్‌కు హైదర్‌గూడ మీదుగా వెళ్తున్నది. మంగళవారం తెల్లవారు జామున హైదర్‌గూడ సెంట్రల్ పార్కు హోటల్ సమీపంలో ప్రమాదవశాత్తు బస్సు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి పైకి ఎక్కింది. బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బస్సు టైర్ పంక్చర్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సు డ్రైవర్ శివ పోలీసులకు తెలిపాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై నిలిచిన ట్రావెల్ బస్సును తొలగించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

## బాలుడి హత్య కేసులో.. జీవితఖైదు

- రూ.15వేల జరిమానా

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలుడి(3)పై జరిగిన లైంగికదాడితో పాటు హత్యకు పాల్పడిన నిందితుడు ముత్యాల రవి (37)కి జీవిత ఖైదుగా శిక్ష విధిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి టి.అనిత సంచలన తీర్పు వెల్లడించారు. ఐపీసీ 377, 302, 120–బీ సెక్షన్ల కింద సహజ మరణం పొందేంత వరకు జీవితఖైదీగా కొనసాగాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలుడి తల్లితో నిందితుడికి అక్రమసంబంధం కొనసాగుతున్న సమయంలో బాలుడిని అడ్డు తొలగించేందుకు పథకం పన్ని హత మార్చినట్టు రుజువు కావడంతో శిక్ష ఖరారైంది. బాలుడి తల్లిని సైతం రెండో ముద్దాయిగా ఈ కేసులో చేర్చినప్పటికీ.. ఆమెపై కేసును కొట్టివేస్తూ తీర్పు ప్రకటించారు. హాకా భవన్‌లోని పోక్సో ప్రత్యేక కోర్టులో మంగళవారం ఈ తీర్పును వెలువరించారు. స్టేషన్ అధికారి జహంగీర్ యాదవ్ కేసు నమోదు చేసి కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేశారు. భరోసా అధికారులు టి.కల్పన, ఉమ కేసుకు సహకరించారు.